17 నుంచి 2 వరకు సేవాపక్ష కార్యక్రమాలు



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ ఎమ్మెల్సీ మల్కా కొమురయ్య

బర్కత్‌పుర, సెప్టెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా ఈ నెల 17 నుంచి అక్టోబరు 2వ తేదీ (గాంధీ జయంతి) వరకు సేవాపక్ష కార్యక్రమాలలో భాగంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు బీజేపీ ఎమ్మెల్సీ మల్కా కొమురయ్య తెలిపారు. శనివారం బర్కత్‌పురలోని నగర కార్యాలయంలో 8 జిల్లాల బీజేపీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో సేవాపక్ష రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొమురయ్య మాట్లాడుతూ... ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా ఈ నెల 17న రాష్ట్ర వ్యాప్తంగా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ నెల 18న స్వచ్ఛభారత్, వికసిత్ భారత్‌లో భాగంగా పాఠశాలలు, కళాశాలల్లో చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 25న పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా అన్ని పోలింగ్‌బూత్‌లలో మొక్కలు నాటే కార్యక్రమం, మేధావుల సదస్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 27న దివ్యాంగులకు చేయూత కార్యక్రమం, వివిధ పరికరాల పంపిణీ, 28న జాతీయ అవార్డు గ్రహీతలకు సన్మానం, 2న గాంధీ, లాల్‌బహదూర్‌శాస్త్రీ జయంతిలను ఘనంగా నిర్వహించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు డాక్టర్ ఎన్.గౌతంరావు, టి.వీరేందర్‌గౌడ్, వివిధ జిల్లాల అధ్యక్షులు లంకల దీపక్‌రెడ్డి, భరత్‌గౌడ్, రాంగోపాల్ గౌడ్, నిరంజన్ యాదవ్, ఉమామహేందర్, వి.శ్రీనివాస్ రెడ్డి, కార్పొరేటర్లు కన్నె ఉమాదేవి, వై. అమృత, సెంట్రల్ జిల్లా ప్రధానకార్యదర్శి ఎడెల్లి అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం : మాజీ ఎంపీ



చెక్కులను లబ్ధిదారులకు అందజేసిన మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, మాజీ కార్పొరేటర్ వాజిద్ హుస్సేన్

ముషీరాబాద్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతగానో దోహద పడుతుందని మాజీ ఎంపీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్‌కుమార్ యాదవ్ అన్నారు. శనివారం బోలక్‌పూర్‌కు చెందిన లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మాజీ కార్పొరేటర్ వాజీద్ హుస్సేన్‌తో కలిసి అంజన్‌కుమార్‌యాదవ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం కావల్సిన నిధులను అందజేస్తున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వాజీద్ హుస్సేన్, పార్టీ నాయకులు రహీమొద్దీన్, యూత్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు సంగపాక వెంకట్, అభిషేక్ కెనడీ, షాంద్‌ఖాన్, ఫయాజ్, వేణుగౌడ్ పాల్గొన్నారు.

నల్లకుంటను స్వచ్ఛ డివిజన్‌గా తీర్చిదిద్దుతాం

నల్లకుంట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నల్లకుంటను పరిశుభ్రమైన డివిజన్‌గా తీర్చిదిద్దనున్నట్లు కార్పొరేటర్ యాకర అమృత పేర్కొన్నారు. పారిశుధ్యం పెరిగితేనే అనారోగ్యకరమైన సమస్యలు ఉత్పన్నమవుతాయని అన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు తమ ఇంటితోపాటు పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకున్నప్పుడే రోగాలు దరిచేరవని అన్నారు. శనివారం డివిజన్‌లోని మాతృశ్రీ స్కూల్ గ్రౌండ్‌లో జీహెచ్‌ఎంసీ పారిశుధ్య కార్మికులకు చెత్తను తరలించే రిక్షాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటింటికీ వచ్చే రిక్షాలలోనే చెత్త వేయాలని, రోడ్లపై వేయొద్దని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మకుంటలో రోడ్డు పనులు పూర్తి చేయాలి

నల్లకుంట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని బతుకమ్మకుంటలో చేపడుతున్న రోడ్డు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి జీహెచ్‌ఎంసీ అధికారులకు సూచించారు. శనివారం డివిజన్‌లోని బతుకమ్మకుంటలో రోడ్డు పనులను ఆమె జీహెచ్‌ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ రవినాయక్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్‌లోని పలు కాలనీలు, బస్తీలలో చేపడుతున్న నూతన సీసీ రోడ్డు పనులను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు జమ్మిచెట్టి బాలరాజ్, న్యాయవాది శ్రీహరి, ట్యూషన్ శేఖర్, రాహుల్, బాలకృష్ణగౌడ్, మిర్యాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

● కిషన్‌రెడ్డిని కలిసిన గౌతంరావు



బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన డాక్టర్ ఎన్.గౌతంరావును శనివారం బర్కత్‌పురలోని ఆయన నివాసంలో కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అభినందించారు. మర్యాదపూర్వకంగా కలిసిన సందర్భంగా డాక్టర్ ఎన్.గౌతంరావు కిషన్‌రెడ్డికి పూలబొకే అందించి కృతజ్ఞతలు తెలిపారు. సెంట్రల్ జిల్లా ప్రధానకార్యదర్శి యెడెల్లి అజయ్‌కుమార్, కోశాధికారి ఏ సూర్యప్రకాష్‌సింగ్, నాయకులు క్షీరసాగర్, నవీన్, గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు. - బర్కత్‌పుర

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

నల్లకుంట: నల్లకుంట డివిజన్‌కు చెందిన పీతాంబర్ మోతీలాల్‌కు వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ.60 వేల చెక్కును శనివారం కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో నల్లకుంట కార్పొరేటర్ యాకరఅమృత, బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడ లంకల దీపక్‌రెడ్డి, సికింద్రాబాద్ అసెంబ్లీ కన్వీనర్ ఏడెల్లి అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

బర్కత్‌పుర, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ డివిజన్ నింబోలి అడ్డ మహాకాళి ఆలయం వద్ద ఓమెక్స్ హాస్పటల్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్ యాదవ్, డాక్టర్ టి.తరుణ్, ఆలయ కమిటీ నిర్వాహకుడు రాజేందర్ పటేల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పఠాన్‌బస్తీలో ఉచిత మెగా వైద్యశిబిరం

ముషీరాబాద్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ డివిజన్ పఠాన్‌బస్తీలోని ఐషా ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఉదయం 10గంటలకు ప్రోకేర్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని డివిజన్ మైనార్టీ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ ఫర్వేజ్ తెలిపారు. ఈ వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ముఠా గోపాల్ ప్రారంభిస్తారని తెలిపారు.

బైబిల్ హౌస్ యూపీహెచ్‌సీ వైద్యాధికారిగా ఐశ్వర్య

ముషీరాబాద్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రంగానగర్‌లోని బైబిల్ హౌస్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(యూపీహెచ్‌సీ) వైద్యాధికారిగా డాక్టర్ ఐశ్వర్య శనివారం బాధ్యతలు చేపట్టారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తామని పేర్కొన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

బీజేపీ గెలుపు కోసం నాయకులు కృషిచేయాలి

కవాడిగూడ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎక్కడ ఉపఎన్నికలు జరిగినా, స్థానిక సంస్థల ఎన్నికలు జరిగినా బీజేపీ గెలుపుకోసం కృషిచేయాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల అశోక్, నాయకులు, కార్యకర్తలకు సూచించారు. బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా నూతనంగా నియమితులైన వేముల అశోక్‌ను శనివారం దోమలగూడలోని కవాడిగూడ కార్పొరేటర్ కార్యాలయం వద్ద ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వేముల అశోక్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో జరిగే ఎలాంటి ఎన్నికలలో నైనా బీజేపీ గెలుపు కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



భోలక్‌పూర్‌లో జరిగిన మిలాద్ ఉన్ నబీ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ముఠా గోపాల్



సిద్దిక్‌నగర్‌లో మిలాద్ ఉన్ నబీ వేడుకలకు ఏర్పాటు చేసిన తోరణాలు

భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ వేడుకలు

ముషీరాబాద్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మిలాద్ ఉన్ నబీ వేడుకలు ప్రజల్లో ఐక్యతను పెంపొందిస్తాయని ఎమ్మెల్యే ముఠా గోపాల్ పేర్కొన్నారు. శనివారం భోలక్‌పూర్‌లోని ఇందిరానగర్‌లో బీఆర్‌ఎస్ డివిజన్ మాజీ అధ్యక్షుడు మహ్మద్‌అలీ, పార్టీ సీనియర్ నాయకుడు నిజాంల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన మిలాద్ ఉన్ నబీ బహిరంగ సభకు ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మహ్మద్ ప్రవక్త బోధనలు శాంతి, దయాగుణాన్ని ప్రసాదిస్తాయని అన్నారు. ఉత్సవాలను, ర్యాలీలను ప్రశాంతంగా జరుపుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు, పార్టీ సీనియర్ నాయకులు రహీం, లోకేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

భోలక్‌పూర్‌లో భారీ ఏర్పాట్లు

ముస్లింలు పవిత్రంగా జరుపుకునే మిలాద్ ఉన్ నబీ వేడుకలకు భోలక్‌పూర్‌లో పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. జెండాలు, తోరణాలు, స్వాగత వేదికలను వీధుల్లో ఏర్పాటు చేశారు. ఆదివారం భారీ ర్యాలీ నిర్వహించేందుకు ఏర్పాటు చేశారు.

నేడు ర్యాలీలలో డీజేలు పెట్టొద్దు



సయ్యద్ ముక్తార్ హుస్సేన్

రాంనగర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఆదివారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించే మిలాద్ ఉన్ నబీ ర్యాలీలలో డీజేలు పెట్టవద్దని పీపుల్ అండ్ పీస్ కమిటీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు సయ్యద్ ముక్తార్ హుస్సేన్ కోరారు. శనివారం గోల్కొండ చౌరస్తాలోని కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మతసామరస్యాన్ని పెంపొందించే విధంగా మిలాద్ ఉన్ నబీ ర్యాలీలను జరుపుకోవాలని సూచించారు. ఈ ర్యాలీలను ప్రశాంతంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించుకుని ప్రభుత్వానికి, పోలీసులకు సహకరించాలని కోరారు. ఇటీవల జరిగిన గణేష్ ఉత్సవ వేడుకలు హైదరాబాద్‌లో మతసామరస్యాన్ని చాటాయని, అదే విధంగా ముస్లింలు కృషి చేయాలని ఆయన కోరారు.

ప్రభుత్వరంగ బ్యాంకులను కాపాడుకోవాలి

సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



ప్రసంగిస్తున్న సాంబశివరావు

బర్కత్‌పుర, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగ బ్యాంకులను పోరాటాల ద్వారానే కాపాడుకోవాలని అప్పుడే దేశం మనుగడ సాధిస్తుందని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. బ్యాంకుల ఉద్యోగులు తమ హక్కులను కాపాడుకోవడంలో చేస్తున్న పోరాటానికి ఎర్రజెండా అండగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. శనివారం కాచిగూడ మున్నూరుకాపు భవన్‌లో సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎంప్లాయీస్ అసోసియేషన్ ఏపీటీఎస్ 37వ మహాసభ, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆఫీసర్స్ యూనియన్ 13వ త్రైవార్షిక సభలు నిర్వహించారు. ఈ సభలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ... ప్రపంచమంతా ఆర్థిక మాంద్యం ఎదురుకున్నప్పుడు ప్రభుత్వ రంగ బ్యాంకులే దేశాన్ని కాపాడాయి అన్నారు. ఏఐబీఈఏ జాతీయ ప్రధాన కార్యదర్శి సీహెచ్ వెంకటాచలం మాట్లాడుతూ... వికసిత్ భారత్ అమృత్‌కాల్ పేరుతో కేంద్ర ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందని ఆరోపించారు. ప్రభుత్వరంగ సంస్థల్లో కార్మిక సంఘాలు లేకుండా కేంద్ర ప్రభుత్వం అనేక కుట్రలు చేస్తుందని వీటిని తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏఐబీఈఏ జాతీయ కార్యదర్శి బీఎస్ రాంబాబు, సెంట్రల్ బ్యాంక్ హైదరాబాద్ జోనల్ హెడ్ కె. దారాసింగ్ నాయక్, ఏఐబీఓఏ ప్రధాన కార్యదర్శి సంజయ్‌కుమార్ ఖాన్, వరంగల్ రీజనల్ హెడ్ ఏవీ కృష్ణమోహన్, విజయవాడ రీజియన్ హెడ్ పి. సతీష్‌బాబు పాల్గొన్నారు.

డ్రగ్స్, గంజాయి, మాదకద్రవ్యాలను అరికట్టాలి



మంత్రి జూపల్లి కృష్ణారావుకు వినతిపత్రం సమర్పిస్తున్న పీవోడబ్ల్యూ, పీవైఎల్ ప్రతినిధులు

రాంనగర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సమాజంలో స్లో పాయిజన్‌గా విస్తరిస్తున్న డ్రగ్స్, గంజాయి, మాదక ద్రవ్యాలను అరికట్టి అందుకు పాల్పడుతున్న దుండగులను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు పీవోడబ్ల్యూ, పీవైఎల్ ప్రతినిధులు శనివారం వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో పీవోడబ్ల్యూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు డి.స్వరూప, పీవైఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.రవికుమార్, నాయకులు లక్ష్మీబాయి, వరలక్ష్మి, కృష్ణ, దేవరాణి, జయప్రసాద్, అంజమ్మ, రాంబాబు పాల్గొన్నారు.

'ధీర సమీరే గంగాతీరే' ఆవిష్కరణ

చిక్కడపల్లి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ రచయిత, రవిమంత్రి రచించిన ధీర సమీరే గంగాతీరే నవల ఆవిష్కరణ సభ శనివారం సాయంత్రం త్యాగరాయ గానసభలో జరిగింది. ఈ సందర్భంగా పుస్తకాన్ని ఆవిష్కరించిన ప్రముఖ సాహితీవేత్త శ్వేత యర్రం మాట్లాడుతూ అమ్మడైరీలో కొన్ని పేజీలు నవలను రెండు లక్షల కాపీలు అమ్మి తెలుగు సాహిత్యంలో కొత్త వరవడికి శ్రీకారం చుట్టిన యువ రచయిత రవి మంత్రి తన రెండో పుస్తకం ధీర సమీరే గంగా తీరే విడుదల చేయడం అభినందనీయమన్నారు. ఈ పుస్తకావిష్కరణకు హాజరైన పాఠకులే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు అని చమత్కరించారు. ఈ సందర్భంగా రచయిత మంత్రి రవి నవల మొదటి ప్రతిని సంతకం చేసి తన మాతృమూర్తికి బహూకరించారు. ఈ కార్యక్రమంలో రవిశర్మ తదితర పలువురు సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.

'టీజీఎస్‌ఆర్టీసీలో వేధింపులు మితిమీరాయి'

రాంనగర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): టీజీఎస్‌ఆర్టీసీలో యూనియన్లు లేకపోవడంతో యాజమాన్యం వేధింపులు మితిమీరాయని టీజేఎంయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె.హనుమంతు ముదిరాజ్ ఆరోపించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పికెట్ డిపోలతో రాజు అనే డ్రైవర్‌కు కేఎంపీఎల్ తక్కువ వస్తుందని 15 రోజులు ట్రైనింగ్‌కు పంపించి, ఆ 15 రోజుల వేతనం లేకుండా ట్రైనింగ్ చేయాలని లెటర్ ఇవ్వడంలో యాజమాన్యం ఎంత తప్పదం చేస్తుందో ఎండీ సజ్జనార్ గుర్తించాలన్నారు. ప్రయాణికులు అధికంగా ఎక్కిన, ట్రాఫిక్ జామ్ అయినా, వర్షాలు పడుతున్నప్పుడు నెమ్మదిగా బస్సు నడిపినా కేఎంపీఎల్ తక్కువ వస్తుందన్నారు. కానీ దానికి పనిష్మెంట్‌గా జీతం లేకుండా ట్రైనింగ్ ఇవ్వడంలో అర్థం ఏమిటని ఆయన ప్రశ్నించారు. గతంలో ట్రైనింగ్‌కు ఎన్ని రోజులు పంపినా వేతనం ఇచ్చేవారన్నారు. ఇలా వేధించడం ఆర్టీసీ యాజమాన్యం మానుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటికీ యూనియన్లు లేకపోవడంతో 2021 వేతన సవరణ, 2025 వేతన సవరణ చేయకపోవడం, నైట్ అవుట్ అలవెన్స్‌లు, డబుల్ డ్యూటీకి డబుల్ వేతనం ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవ తీసుకుని సీఎంతో యూనియన్‌లను అనుమతించాలన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

రేపటి నుంచి కృష్ణాష్టమి వేడుకలు

చిక్కడపల్లి: చిక్కడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 15 నుంచి 19 వరకు కృష్ణాష్టమి వేడుకలు జరుగుతాయని ఆలయ ఈవో కె.రామాంజనేయులు, వ్యవస్థాపక వంశీయుడు రాజేంద్రనాథ్‌గౌడ్ కుమారుడు శ్రీనాథ్‌గౌడ్ తెలిపారు. శ్రీకృష్ణ జననం, భాగవతపురాణ కాలక్షేపం, ఉట్లు కొట్టు మహోత్సవం, ప్రబంధ సేవా కాలం తదితర కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలి : ఆర్.కృష్ణయ్య



విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య

రాంనగర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని ఎంపీ ఆర్.కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు కావాల్సిన బడ్జెట్‌ను కేటాయించాలన్నారు. ఎంపీ ఆర్.కృష్ణయ్య జన్మదినం సందర్భంగా బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో విద్యానగర్‌లోని బీసీ భవన్ వద్ద విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో వారు చదువుకున్న పాఠశాలలోని వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, నందగోపాల్, విద్యార్థులు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● ఎంపీ ఆర్.కృష్ణయ్య జన్మదినం పురస్కరించుకుని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ గంగాపురం పద్మ ఆధ్వర్యంలో శనివారం విద్యానగర్ బీసీ భవన్ వద్ద పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీ ఆర్.కృష్ణయ్య ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ర్యాగ అరుణ్‌కుమార్, జి.రాజ్‌కుమార్, సి.రాజేందర్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



ప్రముఖులను సత్కరిస్తున్న అతిథులు, నిర్వాహకులు

'అశోక్‌నగర్' వార్షికోత్సవాలు ప్రారంభం

చిక్కడపల్లి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అశోక్‌నగర్ కల్చరల్, వెల్ఫేర్ అసోసియేషన్ వార్షికోత్సవాలు శనివారం సాయంత్రం అసోసియేషన్ భవనంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథులుగా బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, ఎస్‌బీఐ అశోక్‌నగర్ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ సంతాజీ కందుగుల పాల్గొని ప్రముఖులను సత్కరించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ ఐ ఆస్పత్రి వైద్యులు డా.వెంకటాచలం, నిర్వాహకులు బి.సూర్యప్రకాష్, వైఆర్‌రెడ్డి, డా.అంజుబాబు, జి. పద్మావతి, శివన్నాయుడు పాల్గొని తమ సంస్థ కార్యక్రమాలు సభికులకు వివరించారు. అనంతరం గాయనీగాయకులు మధురంగా సినీ గీతాలు, ఆధ్యాత్మిక గీతాలను ఆలపించారు.



సెల్‌ఫోన్‌లు అందజేసిన చిక్కడపల్లి ఏసీపీ రమేశ్‌కుమార్, డీఐ శంకర్

సెల్‌ఫోన్‌లను జాగ్రత్తగా దాచుకోవాలి

చిక్కడపల్లి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి:): మొబైల్‌ఫోన్‌లను జాగ్రత్తగా దాచుకోవాలని చిక్కడపల్లి ఏసీపీ ఎల్.రమేశ్‌కుమార్ అన్నారు. చిక్కడపల్లి పీఎస్ పరిధిలో మొబైల్‌ఫోన్‌లను పోగొట్టుకున్న 38 మందికి వారు పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌లను ఏసీపీ రమేశ్‌కుమార్, డీఐ శంకర్ శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ సినిమా థియేటర్లు, రద్దీప్రాంతాలు, వారంవారం జరిగే కూరగాయల మార్కెట్‌లలో చాలామంది మొబైల్‌ఫోన్‌లను పోగొట్టుకుంటున్నారని, ఆగంతకులు మొబైల్‌లను చోరీ చేయకుండా జాగ్రత్తగా దాచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఐ శంకర్ పాల్గొన్నారు.

అంబర్‌పేట డివిజన్‌ను అభివృద్ధి చేస్తా



న్యూపటేల్‌నగర్‌లో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ తదితరులు

అంబర్‌పేట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట నియోజకవర్గంలో అంబర్‌పేట డివిజన్‌ను అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పేర్కొన్నారు. శనివారం అంబర్‌పేట డివిజన్ న్యూపటేల్‌నగర్‌లో రూ.16 లక్షలతో నూతన సీసీరోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. డివిజన్‌లో ప్రజల సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ అంబర్‌పేట డివిజన్ అధ్యక్షుడు సిద్ధార్థ ముదిరాజ్, నాయకులు రామారావుయాదవ్, వంజరి నాగరాజు, జలమండలి డీజీఎం విష్ణువర్ధన్, ఏఈ ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ 'యాత్రదానం'ను సద్వినియోగం చేసుకోవాలి



డి.సురేందర్, ఆర్టీసీ ముషీరాబాద్ డిపో మేనేజర్

రాంనగర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ యాజమాన్యం నూతనంగా ప్రవేశపెట్టిన యాత్రదానం కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ముషీరాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ డి.సురేందర్ కోరారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రత్యేకమైన, ఆనందదాయకమైన రోజులలో యాత్రలను దానం చేసే ఈ వినూత్న పథకానికి శ్రీకారం చుట్టామన్నారు. వ్యక్తుల పుట్టినరోజులు, వివాహ వార్షికోత్సవాలు, పండుగలు, శుభకార్యాలకు సంబంధించిన రోజులలో సేవాదృక్పథంలో భాగంగా అనాథ ఆశ్రమంలో ఉండే పిల్లలను, వృద్ధాశ్రమంలో ఉండే వృద్ధులు, దివ్యాంగులు, పేదవిద్యార్థులను ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రాంతాలు, విజ్ఞాన, విహార యాత్రలకు తీసుకెళ్లడం కోసం ఈ పథకం ప్రవేశపెట్టామన్నారు. ఆసక్తి గల వారు బస్సుల కోసం 9959226418 (డిపో మేనేజర్), 9885423042 (మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్)లకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

అన్నదానం కోసం రూ.1.91 లక్షల విరాళం

రాంనగర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): భువనగిరిలోని శ్రీస్వర్ణగిరి వేంకటేశ్వరస్వామి దేవాలయంలో భక్తులకు అన్నదానం చేయడానికి రాంనగర్ ఆర్యవైశ్య ఫ్యామిలీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆలయానికి రూ.1.91లక్షల విరాళాన్ని శనివారం ఆలయ ప్రజాసంబంధాల అధికారి సాయిబాబాకు అందజేశారు. రాంనగర్ ఆర్యవైశ్య ఫ్యామిలీ వెల్ఫేర్ అసోసియేషన్, రాంనగర్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వినిశెట్టి సుధాకర్‌గుప్తా ఆధ్వర్యంలో ప్రతినిధులు ఈ విరాళం అందజేశారు. తాము చెల్లించిన ఈ విరాళం ద్వారా 25 సంవత్సరాల పాటు సంవత్సరానికి ఒక్క రోజున తమ అసోసియేషన్ తరపున భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు కాసనగొట్టు రాజశేఖర్‌గుప్తా, ఎర్రం శ్రీనివాస్, పులిగిల్ల కృష్ణమూర్తి, సత్యవర్ధన్, నేతి లక్ష్మణ్; ఎర్రం చంద్రశేఖర్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి ఎల్‌వోసీ పత్రం అందజేత



అంబర్‌పేట నియోజకవర్గంలోని గోకుల్‌నగర్‌కు చెందిన హెచ్.పద్మావతి అనారోగ్యానికి గురై నిమ్స్ ఆస్పత్రిలో చేరిన ఆమెకు అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సీఎం సహాయ నిధి కింద రూ.1.10లక్షలను మంజూరు చేయించి, ఎల్‌వోసీ పత్రాన్ని శనివారం బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. - రాంనగర్, ఆంధ్రజ్యోతి



సుబ్బరాయశర్మను సన్మానిస్తున్న అతిథులు

హాస్యాన్ని అసభ్యత లేకుండా పండించడం అంత సులువు కాదు

చిక్కడపల్లి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): హాస్యాన్ని అసభ్యత లేకుండా పండించడం అంత సులువు కాదని ప్రముఖ సినీదర్శకుడు రేలంగి నరసింహారావు అన్నారు. వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా, వంశీ కల్చరల్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి త్యాగరాయగానసభలో వంగూరి చిట్టెన్‌రాజు రచించిన అమెరికామెడీ నాటికలు ప్రదర్శన తొలిరోజు సాధినేని శ్రీజ దర్శకత్వం వహించిన శ్రీ జయ ఆర్ట్స్ హైదరాబాద్‌వారిచే బామ్మయనం నాటిక సుబ్బరాయ శర్మ రచించిన యమసభ నాటిక మహతి క్రియేషన్స్‌వారిచే ప్రదర్శించారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో అతిథులుగా రేలంగి నరసింహారావు, సినీ నటుడు, రచయిత తనికెళ్ల భరణి, మాజీ ఎంపీ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, శాలువా, జ్ఞాపికతో నటుడు, దర్శకుడు సుబ్బరాయశర్మను జీవిత సాఫల్య పురస్కారంతో సత్కరించారు. ఈ సందర్భంగా వంగూరి ఫౌండేషన్ వారి ప్రచురణ భువనచంద్ర రచన పండి బజార్, వంగూరి చిట్టెన్‌రాజు రచించిన అమెరికా తెలుగు డయాస్పోరా కథలు రాధిక రచన కథ కంచికి గిరిజ శంకర్ రచన అప్పిచ్చువాడు వైద్యుడు శ్యామల దేవి రచన అమెరికా ఇల్లాలు ముచ్చట్లు సంపుటిలను అతిథులు ఆవిష్కరించారు. వంశీ రామరాజు స్వాగతం పలికిన సభలో చిట్టెన్‌రాజు అధ్యక్షత వహించారు.